ప్రజాశక్తి
సోమవారం 27 అక్టోబర్ 2025 5 శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

'ఉచిత కుట్టు శిక్షణ' కథ కంచికేనా..?

ఉపాధి పేరుతో పేద మహిళలను ఊరించారు. ఉచిత శిక్షణ.. కుట్టు మిషన్లు.. అంటూ ప్రగల్భాలు పలికారు. దీంతో వేలాదిమంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. శిక్షణ కాలం ముగిసింది. 'మిషన్' ఇంకా బాకీ ఉంది. మూడు నెలలు గడుస్తున్నా కుట్టు మిషన్లు..సర్టిఫికెట్లు మాటే లేకుండా పోయింది. కుట్టు శిక్షణ పేరిట కట్టు కథ అల్లారని మహిళలు విమర్శిస్తున్నారు. మరో పక్క మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చిన గుత్తేదారులు బిల్లుల కోసం మూడునెలలుగా ఎదురుచూస్తున్నారు. శిక్షణ ఇచ్చిన సిబ్బంది వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు వర్గానికి చెందిన పేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పేరిట కూటమి ప్రభుత్వం హడావుడి చేసింది. శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆచరణలోకి వచ్చే సరికి రిక్తహస్తం చూపిస్తోంది. కుట్టు మిషన్లు వస్తాయి..ఉపాధి పొందవచ్చని ఆశించిన మహిళలకు నిరాశే ఎదురైంది. రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా 65వేల మందికి కూటమి ప్రభుత్వం కుట్టుశిక్షణ ఇప్పించింది. శిక్షణ పూర్తయి 4నెలలు గడుస్తున్నా వారికి ఇస్తామన్న కుట్టుమిషన్ల పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి తొలుత లక్ష మంది బీసీ, ఈబీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 3,43,413 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 680 కేంద్రాలను ఏర్పాటుచేసి 1326బ్యాచ్‌ల ద్వారా 65,987 మందికి మొదట శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 85 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 9,000 మందికి పైగా శిక్షణ ఇచ్చారు.

90 రోజులపాటు శిక్షణ..

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ 23న శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. టైలరింగ్ శిక్షణకు సంబంధించిన అర్హులైన వారు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులు జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లతోపాటు ఎంపీడీవోలకు పంపారు. నిబంధనల ప్రకారం నిరుపేదలై ఉండి 18 ఏళ్ల పూర్తయి 60 ఏళ్లలోపు గల వారిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. పెనుకొండ కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ శిక్షణ కార్యక్రమ బాధ్యతలను తీసుకున్నారు. ఆ మేరకు జిల్లావ్యాప్తంగా 85 శిక్షణ కేంద్రాలనుఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో ఆయా మండల, మున్సిపాలిటీల్లో అవసరమైన వసతులతో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుట్టు మిషన్లు, ఇతర సామగ్రి సమకూర్చడంతోపాటు అనుభవజ్ఞులైన ట్రైనర్లను నియమించారు. ఈ కేంద్రాల ద్వారా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 5 గంటల వరకు మరో బ్యాచ్‌గా మొత్తం 9వేల మందికి 90 రోజులు శిక్షణ ఇచ్చారు.

నాలుగు నెలలైనా అందని కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు

90 రోజులపాటు శిక్షణానంతరం శిక్షణ పొందిన మహిళలకు రూ.6 వేల విలువైన బేసి కొమెడల్ కుట్టుమిషన్ ఉచితంగా అందజేయాలి. సర్టిఫికెట్ ఇవ్వాలి. శిక్షణ పూర్తయ్యి దాదాపు నాలుగునెలలు గడుస్తున్నా ఇంతవరకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందలేదు. శిక్షణ పూర్తి కాగానే ఉచితంగా కుట్టుమిషన్ వస్తుందని, ఈ మిషన్ ద్వారా స్థానికంగాటైలరింగ్ షాపును నిర్వహిస్తూ ఉపాధి పొందవచ్చని పేద మహిళలు భావించారు. అయితే ఆశ నిరాశే అయింది. శిక్షణ పొందిన వారికి నిర్వాహకులు ఏ సమాధానం చెప్పక పోవడంతో శిక్షణ పొందిన మహిళల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.

సిబ్బందికి అందని వేతనాలు, బిల్లుల కోసం గుత్తేదారులు ఎదురుచూపు

ఉచిత శిక్షణలో భాగంగా ఒక కేంద్రానికి ఒక టీచర్ తోపాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. టీచర్ కుట్టు శిక్షణలో మెళకువలు నేర్పడానికి, కంప్యూటర్ ఆపరేటర్ అభ్యర్థుల హాజరు తదితర వివరాలు నమోదు చేసుకునేందుకు నియమించారు. టీచర్‌కు ఒక నెలకు రూ. 15 వేలు, కంప్యూటర్ ఆపరేటర్ కు రూ.12 వేలు చొప్పున వేతనం ఇవ్వాలి. 90 రోజుల శిక్షణ పూర్తి అయినప్పటికీ వేతనాలు అందలేదు. శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి అందుకు అవసరమైన కుట్టు మిషన్లు ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసిన గుత్తేదారులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చామని ఇంతవరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుత్తేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శిక్షణ పొందిన ప్రతి మహిళకు కుట్టుమిషన్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో శిక్షణ పొంది కుట్టుమిషన్ల ద్వారా జీవనభృతి పొందాలనుకున్న మహిళలు శిక్షణకు హాజరయ్యారు. ఇప్ప టికే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్ అందజేస్తే ఉపాధి పొందడానికి అవకాశం ఉందంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో 9వేల మందికి ఉచిత శిక్షణ
- కుట్టుమిషన్ల కోసం మహిళల ఎదురుచూపు
- మూడు నెలలైనా అందని కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు
- సిబ్బందికి అందని వేతనాలు, బిల్లుల కోసం గుత్తేదారుల ఎదురుచూపు
- బీసీ, ఈబీసీ, కాపు మహిళలకు రిక్తహస్తం



కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలు (ఫైల్ ఫొటో)

కుట్టు మిషన్లు తక్షణం ఇవ్వాలి



శిక్షణ పూర్తి చేసుకుని ఉచిత మిషన్ కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం తన కుటుంబం జీవనోపాధికి తోడ్పాటు అందించాలి. శిక్షణ పూర్తి అయి నాలుగు నెలలు అవుతున్న ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ప్రభుత్వం తక్షణం కుట్టు మిషన్ ఇవ్వాలి.

మహేశ్వరి ,
కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళ,
(పెనుకొండ)

కార్మిక హామీలను విస్మరించిన 'కూటమి'

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన మామీలను విస్మరించిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేష్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని కల్లూరు సుబ్బారావు ఉద్యానవనంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెడ్ పి శ్రీనివాసులు, ఈ ఎస్ వెంకటేష్ ల ఆధ్వర్యంలో హిందూపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, పట్టణం సుందరీకరణ కోసం ప్రతినిత్యం సేవలు చేస్తున్న దళిత కార్మికులను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సుప్రీం కోర్టు తీర్పులు సైతం ఉల్లంఘించి, కనీస వేతన చట్టాన్ని సైతం అమలు చేయడం లేదన్నారు. 40 సంవత్సరాల పాటు సేవలు అందించిన కార్మికులు విశ్రాంతి తీసుకుంటే వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఇంటికి పంపిస్తున్నారని విమర్శించారు. పురపాలక సంఘంలో వెట్టి చాకిరి చేయించుకుని, అనారోగ్యంతో మృతి చెందితే కార్మికులకు మట్టి ఖర్చులకు సైతం నయా పైసా విదల్చడం లేదన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు జగదీష్, మూర్తి, మల్లయ్య, మురళి, రామాంజినప్ప, శ్రీరాములు, అంజి, శంకర, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం : హిందూపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా మురళి, అధ్యక్షులుగా మూర్తి, కోశాధికారిగా మల్లయ్య, ఉపాధ్యక్షులుగా రామాంజినప్ప, శ్రీరాములు, అంజి, సహాయ కార్యదర్శులుగా బాబాయ్య, శంకర, సి మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పైన ఎప్పటికప్పుడు స్పందించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి పోరాటాలు చేస్తామన్నారు.



వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలన చేస్తున్న జిల్లా ఎస్పి సతీష్ కుమార్

చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ఆదివారం ఉదయం ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో పట్టణంలోని గుడ్డం, త్యాగరాజ నగర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటిని సోదా చేశారు, రౌడీ షీటర్లు, పాత నేరస్తుల ఇళ్లకు వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్పీ నేతత్వంలో ఇద్దరు డీఎస్పీలు 5 మంది సీఐలు, 8 మంది ఎస్సైలు,మొత్తం 120 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నెంబర్ ప్లేట్లు, రికార్డులు లేని 77 ద్విచక్ర వాహనాలు, 7ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లకు ప్రవర్తన మార్చుకుని మెలగాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో తాగి గొడవలు, అల్లర్లు చేసే వారిపై కొత్త రౌడీ షీట్లు తెరవబడతాయని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత కఠినంగా అమలు చేస్తామని ఎస్పీ తెలిపారు. పోలీసుల విధులకు, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రతి ప్రాంతంలోనూ సోదాలు కొనసాగుతాయని, నేరాలు, రౌడీయిజం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం, పెనుకొండ డీఎస్పీలు మహేష్, నర్సింగప్ప, సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ఆంజనేయులు, రాజ్ కుమార్, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-హిందూపురం

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కోరారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొట్నూరులో వాల్మీకి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు వెంకటరమణప్ప, నాయకులు శివశంకర్, ఆదినారాయణప్ప, ఆకుల సూరి, ఎన్.బి.కె.రాజు, సోమశేఖర్, చంద్రశేఖర్, నంజుండ, వేణు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైసిపికార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమం గోడపత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేదలకు విద్య, వైద్యం దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. ఫీజులు చెల్లించుకోలేని పేద విద్యార్థులు ప్రతిభ ఆధారంగా నైపుణ్యంతో వైద్య విద్యను అభ్యసించడానికి ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అనుబంధ విభాగాల నాయకులు, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు , పట్టణ అధ్యక్షులు, మండల కన్వీనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కమిటీ సభ్యులు, వివిధ శాఖల మాజీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



ఫోటో:5. పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

గ్రామాల్లో ప్రజలు కలిసి మెలిసి ఉండాలి : డీఎస్పీ


ప్రజాశక్తి-బత్తలపల్లి

గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లకూడదని, పిల్లలను బాగా చదివించుకొని ఉన్నత విద్యావంతులుగా చేయావాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ సూచించారు. సమాజంలో జరిగే వివిధ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలోని రామాపురం గ్రామంలో ఆదివారం ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్‌లతో కలసి 'వారధి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రొజెక్టర్ ద్వారా రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్‌నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో జరిగే వివిధ అంశాలపై ప్రజలు ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాభద్రతే-పోలీసుల బాధ్యత అన్నారు. మహిళలు, ప్రజల భద్రత ముఖ్య ప్రాధాన్యతగా భావించి గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన చేపట్టామన్నారు. అలాగే మహిళల భద్రత, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ సేఫ్టీ, రోడ్డు సేఫ్టీ, శక్తి యాప్, డిజిటల్ మోసాలు, మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, బాల్య వివాహాలు, పోక్సో కేసులు, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఈవ్ టీజింగ్‌పై పజలకు వివరించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తుంటే 100, 112కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిగి సర్పంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పరిగి

పరిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్‌తో పాటు ఇద్దరు వార్డు మెంబర్లు టిడిపిలో చేరారు. వారు ఆదివారం పెనుకొండ పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి సవిత సమక్షంలో టిడిపిలో చేరగా వారికి మంత్రి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సర్పంచులకు కనీసం నిధులు సక్రమంగా అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించిందన్నారు. తద్వారా పంచాయతీల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. మంత్రి సవిత అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా రహదారులకు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారన్నారు. దీంతో ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం సక్సెస్ అయిందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తామన్నారను. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎస్.ఎన్.గోవింద్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ, బాలాజీ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో టిడిపిలో చేరిన పరిగి సర్పంచి లక్ష్మీదేవి, శివశంకర్, వార్డు మెంబర్లు

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

జిల్లా రవాణాశాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు ఉండవని జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. వాహనాలు నడిపే డ్రైవర్లు అతివేగంగా వెళ్లడం, మద్యం సేవించి వాహనాలు నడపడం నిర్దేశించిన కెపాసిటీని కాదని అధిక లోడ్ వేసుకొని ప్రయాణించడం, రోడ్డు మలుపులలో సైతం వేగంగా ప్రయాణించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. కొందరు మైనార్టీ తీరని పిల్లలు కూడా వేగంగా బైకులు, ఇతర వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. ఈ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎన్నో నియమ నిబంధనలు విధించినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉంటాయి. తరచూ రవాణా శాఖ అధికారులు, పోలీస్ శాఖ వారు తనిఖీలు నిర్వహిస్తూ ఆర్ సి (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు ఉన్నాయా లేదా అని చూస్తూనే ఉంటారు. ప్రమాద సూచికల బోర్డులు ఉన్నా వాటిని పట్టించుకోకుండా వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలకు లోనవుతుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డు భద్రత నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.



ప్రశ్న: ప్రధానంగా వాహన డ్రైవర్లకు ఉండవలసిన ధ్రువీకరణ పత్రాలు ఏమిటి? ఎక్కడ మంజూరు చేస్తారు?

ఆర్టీవో : డ్రైవర్లకు ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కాలుష్య నియంత్రణ (పొల్యూషన్) సర్టిఫికెట్, వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలి. ఇవేవీ లేకుండా వాహనాలు నడపకూడదు. అలా నడిపితే చట్టపరంగా జరిమానాలతో పాటు వాహనాలు సీజ్ చేస్తాం. మా శాఖ అధికారులతో పాటు పోలీస్ అధికారులు కూడా తనిఖీలు నిర్వహించే అధికారం ఉంది. జిల్లాలో హిందూపురం, ధర్మవరం, కదిరి ప్రాంతాల్లో వాహనాల ఆర్‌సి డ్రైవింగ్ లైసెన్స్ మా శాఖ కార్యాలయాల్లో పొందవచ్చు. కొత్త వాహనాలు అయితే కొనుగోలు కేంద్రాలైన షోరూమ్ లోనే డీలర్లే లైసెన్స్, బండి నెంబర్, ఆన్ లైన్ ద్వారా కొనుగోలుదారులకు అందించే విధంగా కూడా మార్పులు వచ్చాయి. కొత్త వాహనదారులు ఈ సౌకర్యం పొందవచ్చు.

ప్ర: వాహనాల ఫిట్నెస్ ఎక్కడ చూస్తారు?

ఆర్టీవో : గతంలో మా శాఖ చూస్తూ ఉండేది. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా అంతటికి మండల కేంద్రమైన బుక్కపట్నంలో ప్రభుత్వం నియమించిన ప్రైవేటు వ్యక్తుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. వాహన దారులు తమ వాహనాల ఫిట్నెస్ అక్కడే చేయించుకోవలసి ఉంటుంది. వాహనాల ఫిట్నెస్ యంత్ర పరికరం ద్వారా నిర్ధారిస్తారు.

ప్ర: జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి? వాహనాలకు ఎంత జరిమానా విధించారు?


ఆర్టీవో : జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 429 ప్రమాదాలు జరగగా 255 మంది మృతి చెందారు. 483 మంది గాయపడ్డారు. అలాగే వాహనాలకు జరిమానాల రూపంలో రూ .1.98 కోట్లు వసూలు చేయడం జరిగింది. ఈ జరిమానాల వల్ల ప్రజల్లో మార్పు వస్తుందనుకోవడం లేదు. వారిలో చైతన్యం రావాలి. ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎంతో నష్టపోవాల్సి ఉంటుంది. ఆయా కుటుంబాలలో ఎంతో విషాదం చోటు చేసుకుంటుందన్న విషయాలపై అవగాహన వస్తే ప్రమాదాలు నివారణ సాధ్యమవుతుంది.

ప్ర :ప్రజల్లో చైతన్యం కోసం మీ శాఖ చేపట్టే కార్యక్రమాలు ఏమిటి?

ఆర్టీవో : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఏటా జనవరి మాసమంతా రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమాలు చేపడతాం. పాఠశాలల్లో, కళాశాలలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. హెల్మెట్ వల్ల కలిగే ప్రయోజనాలు, రోడ్డు నియమ నిబంధనలు వివరిస్తాం. అలాగే కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా అవగాహన కల్పిస్తాం.

ప్ర: సత్యసాయి జన్మదిన వేడుకలలో మీ శాఖ పాత్ర ఏమిటి?

ఆర్టీవో : ఆటోలు, ఇతర వాహనాలలో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ప్రయాణికులను ఎక్కించుకున్నా, ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోయినా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తాం. సత్య సాయి జయంతి వేడుకలకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వీవీఐపీలకు ప్రోటోకాల్స్ వాహనాలు సమకూరుస్తాం.



జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి

ప్ర: సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

ఆర్టీవో : సిబ్బంది కొరత అంటూ లేదు. ప్రమాదాలు జరగకుండా ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి. ఎవరు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ప్రమాద సూచికలు గమనించి వాహనాలు నడపాలని సూచిస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి. మైనర్ తీరని పిల్లలు వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాల బారిన పడకుండా అందరూ క్షేమంగా ఉండాలని కోరుతున్నాం.



గోరంట్లలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

'స్థానికసంస్థ'ల్లో వడ్డెర్లకు ప్రాధాన్యం : మంత్రి

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గం ప్రజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని బస్టాండ్‌లో మంత్రి తన తండ్రి జ్ఞాపకార్థం ఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఆ విగ్రహాన్ని ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ టిడిపితో బిసిలకు రాజకీయ, ఆర్థిక సామాజిక ప్రాధాన్యం లభిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు బిసిలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నా న్నారు. బిసిల మనోభావాలకు గౌరవమిస్తూ విశ్వకర్మ, వాల్మీకి, కనకదాసు జయంతి కార్యక్రమా లను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. వచ్చే ఏడాది జనవరి 11వ తేదీ వడ్డే ఓబన్న జయంతిని కూడా అధికారికంగా నిర్వహిస్తుంద న్నారు. వడ్డెర్లకు నామినేటెడ్ పదవులు కూడా కల్పిస్తోందన్నారు. క్వారీల్లో 15శాతం రిజర్వేషన్‌తో పాటు సీనరేజ్ ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇస్తోందన్నారు. వడ్డెర్లు విద్యపరంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, బిజెపి జిల్లా అధ్యక్షులు జెఎం.శేఖర్, వడ్డెర సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, దేవళ్ల మురళి, గౌనివారిపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు రవిమోహన్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమర్నాథ్, సర్పంచి వినోద్, నాయకులు నాగేంద్ర, అధిక సంఖ్యలో వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సంక్షేమానికి కృషి

వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు

ప్రజాశక్తి-కొత్తచెరువు

వడ్డెర సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం కొత్తచెరువుకు రాగా స్థానిక టిడిపి శ్రేణులు, వడ్డెర్లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి, అలాగే వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వడ్డే ఓబన్న స్వాతంత్య్ర పోరాటంలో చేసిన సేవలను కొనియాడారు. సిఎం చంద్రబాబు వడ్డెర్లను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి తనకు ఛైర్మన్ పదవి ఇచ్చారని తెలిపారు. గనుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వం నుంచి అందే పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. వడ్డెర్లకు ఇళ్ల పట్టాలు, ప్రమాద బీమా, కాంట్రాక్ట్ పనుల్లో రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న ఈశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర వడ్డెర సాధికారిక కమిటీ ఛైర్మన్ వడ్డే వెంకట్, టిడిపి జిల్లా కార్యదర్శి సాంకోటి ఆదినారాయణ, నాయకులు మాణిక్యం బాబా, నాగేంద్రప్రసాద్, కేశవ్, బైరెల్ కొండప్ప, పెద్దన్న, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఈశ్వరరావు



సమావేశమైన బంజారా సేవా సంఘం నాయకులు

లంబాడీల హక్కుల కోసం పోరాడుతాం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

లంబాడీల హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేస్తామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు చక్రేనాయక్ తెలిపారు. ముదిగుబ్బలో ఆదివారం ఆ సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా స్థానిక బాలాజీ కళ్యాణ మండపం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు చక్రేనాయక్, జాయింట్ సెక్రటరీ గోపాల్‌నాయక్, జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్రనా యక్, కార్యదర్శి శ్రీనివాస నాయక్ ఎన్నిక అధికారులుగా వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా బి.రామాంజనేయులు నాయక్, కార్యదర్శిగా హనుమంతు నాయక్, కోశాధికారిగా ఆర్.రాము నాయక్, మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా నాగమణి బాయ్, యూత్ ప్రెసిడెంట్‌గా శివానాయక్, కార్యదర్శులుగా కె.అంజినాయక్, కుళ్లాయప్పనాయక్ లను ఎన్నుకున్నారు. చక్రేనాయక్ మాట్లాడుతూ మండలంలో బంజారా భవన్ ఏర్పాటు చేస్తామ న్నారు. మైదాన ప్రాంతంలో ఉన్న బంజారాలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. బి.గోపాల్ నాయక్ మాట్లాడుతూ బంజారాల సంస్కృతీ, సంప్రదా యాలను కాపాడుతూ, తండాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

క్రికెట్ పోటీలో ఫైటర్స్ జట్టు విజయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఫైటర్స్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు ఫైటర్స్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. సాయి (ప్రణీత్-58, ప్రణయ్-45 పరుగులతో రాణించారు. బాదల్ హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఛాలెంజర్స్ జట్టు 30 ఓవర్లలో 110 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కెప్టెన్ తరుణ్-62 నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, హరి, రెడ్డప్ప, హారూన్ హాజరై క్రీడాకారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే ప్రతిభ చూపిన క్రీడాకారులు సంతోష్, తరుణ్, జితేంద్ర, నందులకు కదిరి మండల క్రికెట్ సంఘం సమకూర్చిన బూట్లను అందజేశారు. హ్యాట్రిక్ సాధించిన బాదల్‌కు బ్యాగ్‌ను అందజేశారు. మధ్యాహ్నం అండర్-12 క్రీడాకారులకు మ్యాచ్ నిర్వహించారు.

'రోడ్డు ఇలా... రాకపోకలు ఎలా'..?



నీరు నిలిచి బురదమయమైన రోడ్డు

ప్రజాశక్తి-పరిగి

ఇటీవల కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో గ్రామీణ ప్రాంత రహదారుల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ప్రధానంగా మండలంలోని తిరుమలదేవరపల్లి ప్రధాన రహదారిలో వర్షం నీరు నిల్వ ఉండటంతో ఇటు గ్రామస్తులు, అటు వాహనదారులు రాకపోకల సమయంలో నానా అవస్థలు పడుతున్నారు. ఆ మార్గంలో సీసీ రోడ్డు ఉన్నప్పటికీ పెద్దఎత్తున గుంతలమయంగా మారింది. దీంతో వర్షం నీరు, ఇళ్లలోని వృథా నీరు తోడై నిత్యం నిల్వ ఉండడంతో రోడ్డు పాచిపట్టింది. దీంతో వాహనదారులు జారి పడే ప్రమాదం కూడా ఉంది. ఈ విషయాన్ని పంచాయతీ సెక్రటరీ వెంకటేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా అక్కడ నీరు నిలువున్న మాట వాస్తవమే. ఆ కాలనీవాసులు వర్షం నీరు పక్కకు తరలించేందుకు సహకరించడం లేదు. త్వరలోనే ఉపాధి హామీ ద్వారా నూతనంగా ఏర్పాటు చేస్తున్న మ్యాజిక్ డ్రైనేజీలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఎపిజిబి సేవల్లో అంతరాయం..!

పని చేయని యుపిఐ సేవలు.. ఇబ్బందుల్లో ఖాతాదారులు

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీలు ఉండగా వివిధ గ్రామాల ప్రజలు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఎపిజిబి)లో పెద్దఎత్తున ఖాతాలు తెరిచారు. విద్యార్థులు అవసరాల నిమిత్తం తల్లిదండ్రులతో కలిసి వందలాది జాయింట్ అకౌంట్లు తెరిచారు. అయితే ఇటీవల బ్యాంకు కార్యకలా పాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ మారిన కారణంగా బ్యాంకు సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా ఫోన్ పే సేవలు పని చేయడం లేదు. అలాగే వివిధ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రతిరోజూ వందలాది మంది ఖాతాదారులు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక ఇంట్లో ఒక ఫోన్ నెంబర్‌కు సంబంధించిన ఒక అకౌంట్ మాత్రమే పని చేస్తుందని పొరపాటున ఆ ఇంట్లో చదువు కున్న పిల్లలు ఉంటే ఆ పిల్లలు వారి తల్లిదండ్రులకు సంబంధించిన జాయింట్ అకౌంట్ ఉంటే వారి పర్సనల్ అకౌంట్‌కు ఫోన్ పే పనిచేయడం లేదు. దీంతో పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయో లేదో అని ఆందోళనకు గురవుతూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. అయితే బ్యాంక్ అధికారులు ఖాతాదారుల సమస్యలపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో ఈ బ్యాంకు ఒక్కటే ఉండటం వల్ల ప్రజలు వేల సంఖ్యలో ఖాతాలు తెరిచారు. ఈ ప్రాంతం విద్యార్థులు తిరుపతి, కుప్పం, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్, చెన్నై, కర్నాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో చదువుతున్నారు. ఈ క్రమంలో తమ పిల్లలకు యుపిఐ యాప్‌ల ద్వారా నగదు పంపుతుంటారు. అయితే సుమారు 20 రోజులుగా ఫోన్ పే పని చేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై బ్యాంకులో సంప్రదించినా ఫలితం లేదని ఖాతాదా రులు పేర్కొంటున్నారు. మొదటి నుంచి ఈ బ్యాంకులోనే జాయింట్ అకౌంట్ ఉందని, అందులోకి పిల్లల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు జమ అయ్యేవి. ఇప్పుడు ఉన్నఫలంగా అకౌంట్లు క్లోజ్ చేస్తే పరిస్థితి ఏంటని ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అభివృద్ధిలో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, పురోగతిపై ఆదివారం మంత్రి పట్టణంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో మన బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. ప్రతి గ్రామం, వార్డు ప్రజలకు అభివృద్ధి ఫలాలు చేరేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ప్రతి పంచా యతీలో జరుగుతున్న రోడ్లు, డ్రెయినేజీ, నీటి సరఫరా, హౌసింగ్, విద్య, తదితర అభివృద్ధి పనులపై తక్షణం నివేదికలు సమర్పించాలని, ఏమాత్రం అలసత్వం వద్దని హెచ్చరించారు. ప్రజలకు అందు బాటులో ఉంటూ, వారి సమస్యలను వింటూ తక్షణ పరిష్కారం చూపడం మన కర్తవ్యం అన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులను పారదర్శకంగా వినియోగించాలని, పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో మహేష్, తహశీల్దార్లు సురేష్, నారాయణస్వామి, స్వర్ణలత, భాస్కర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

కూటమి నాయకులకు మంత్రి పరామర్శ

పట్టణానికి చెందిన కూటమి నాయకులు చెన్నంశెట్టి జగదీష్, కేసగాళ్ల శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు.

వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మంథా తుఫాన్ ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండలంలోని ప్రజలను అప్రమత్తం చేయా లని తహశీల్దార్ సురేష్ బాబు వీఆర్‌ఒలు, గ్రామ రెవెన్యూ ఉద్యోగు లను ఆదేశించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు మట్టి మిద్దెల్లో నివాసం ఉండవద్దని, నిద్రించ వద్దని సూచించారు. వర్షాలు తగ్గేంత వరకూ సమీపంలో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఉండాల న్నారు. ఈదురుగాలుల ధాటికి చెట్లు విరిగి పడడం, విద్యుత్ తీగలు తెగిపోయతాయన్నారు. కావున ఎట్టి పరిస్థితుల్లో చెట్లు, విద్యుత్ స్థంబాల వద్ద ఉండవద్దన్నారు. గర్భిణులు ఉంటే వారి పరిస్థితిని బట్టి కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆశా వర్కర్ లేదా సంబంధిత ఎఎన్‌ఎంకు సమాచారం ఇవ్వాల న్నారు. ఎక్కడైనా రోడ్డుపై చెట్లు విరిగిపడి రాకపోకలు స్తంభిస్తే తక్షణమే గ్రామ పంచాయతీ లేదా రెవెన్యూ అధికారులకు విషయం తెలపా లన్నారు. అనారోగ్యంతో ఉంటే వారి కుటుంబ సభ్యులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువులు, కాలువల వద్దకు వెళ్లవద్ద న్నారు. ఆపద, అత్యవసర, అసాధారణ పరిస్థితులు తలెత్తితే తహశీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ 9553929724కు సమాచారం ఇవ్వాలన్నారు. మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి పరిస్థితులకు తక్షణమే స్పందించాలన్నారు. చిత్రావతి నది పరిసర ప్రాంతాల్లో ఉన్న వీఆర్వోలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సురేష్‌బాబు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

డాక్టర్ శింగనమల నాగమణి జ్ఞాపకార్థం యువర్స్ ఫౌండేషన్, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి, చిన్నపిల్లల వైద్యులు బివి.సుబ్బారావు, జనరల్ ఫిజీషియన్ వీరభద్రయ్య, దంత వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్ కుమార్, ఎముకలు కీళ్ల వైద్య నిపుణులు భానుకిరణ్, జనరల్ సర్జన్ డాక్టర్ కొండయ్య, ఆప్తాలమిక్ అసిస్టెంట్ షేక్ సికిందర్ 251 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి 15 రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, క్యాంపు ఛైర్మన్లు పోలా ప్రభాకర్, షేక్ చాంద్ బాషా మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. శిబిరంలో గుప్తా, రమేష్‌బాబు, వైకె. శ్రీనివాసులు, నాగార్జున, రామాంజనేయులు, కౌన్సిలర్, సమాజ సేవకుడు కేతా లోకేష్, రాధాకృష్ణ, కోటేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య నిపుణులు

నేడు కొడికొండ చింతతోపు వేలం

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని కొడికొండ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం చింతతోపునకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. చింతతోపుతో పాటు ఈతచెట్లకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 20 వేల ధరావత్తు చెల్లించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

ప్రజాశక్తి-తనకల్లు

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ గోపి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పించవద్దని, భవిష్యత్తులో ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలని హెచ్చరించారు.

పేకాట జూదరులు అరెస్ట్

నగదు స్వాధీనం

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని నారేవాండ్లపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం ఎస్ఐ గోపి పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న కురుగుంట గోవిందు

కురుగుంట గోవిందుకు డాక్టరేట్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన కురుగుంట గోవిందుకు ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. దీంతో ఆయన తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో ఆయన డాక్టరేట్ అందుకున్నారు. గోవిందు చేపట్టిన సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలతో పాటు సమాచార హక్కు చట్టం లాంటి సేవలను గుర్తించిన ఆ యూనివర్శిటీ వారు డాక్టరేట్ పట్టా, షీల్డ, మెడల్ అందజేశారు. గోవిందు మాట్లాడుతూ డాక్టరేట్ తన బాధ్యతలను మరింత పెంచిందని, రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు.

పోతుల సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-నల్లమాడ

టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్ నివాసంలో ఆదివారం కూటమి నాయకులు పోతుల సురేష్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పోతుల సురేష్ మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతి వైపు ప్రయాణిస్తుందన్నారు. ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రజల కోసం జీవించేవారని కొనియాడారు. వారికి ప్రజలు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, హెడ్ మాస్టర్ చాంప్లా నాయక్, సర్పంచి రమావత్ భారతి చాంప్లా నాయక్, నాయకులు లక్ష్మన్న, అరవింద్‌బాబు, మైలే రామచంద్ర, పాపారాయుడు, డీలర్ వై.నరసింహులు, కేశవరెడ్డి, శ్రీరాములు, మల్లికార్జున, డ్రైవర్ అంజిబాబు, ఎం.నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ చొరవతోనే ఎపికి గూగుల్

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్



ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ విశేష కృషి వల్లే ఐటి దిగ్గజ సంస్థ గూగుల్ డేటా సెంటర్ ఎపికి వచ్చిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఓ ప్రకటనలో తెలి పారు. కూటమి ప్రభు త్వం గూగుల్‌తో ఒప్పందం చేసుకోవడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో ముందు చూపుతో అమెరికా తర్వాత ఒక భారీ స్థాయి ఐటి కంపెనీ గూగుల్ డేటా సెంటర్‌ను ప్రధాని నరేంద్ర మోడీ మార్గదర్శకత్వంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కృషితో ఎపికి రావడంతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరిందన్నారు. ఉమ్మడి ఆంధ్రలో సిఎం చంద్రబాబు ఎంతో ముందుచూపుతో హైదరాబాద్‌లో ఐటి రంగాన్ని అభివృద్ధి చేయగా నవ్యాంధ్రలో మంత్రి లోకేష్ ప్రతేక చొరవ వల్లే విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చిందన్నారు. తద్వారా బెంగళూరు, హైదరాబాద్ తరహాలో ఎపిలో ఐటీ రంగం అభివృద్ధి చెందడమే కాకుండా లక్షలాది మందికి ఐటి ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. సుమారు 15 బిలియన్ల భారీ పెట్టుబడి కలిగిన ఈ ప్రాజెక్టు ఎపికి రావడం రాష్ట్ర ప్రజల అదృష్టం అన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్ వేర్ రంగం ఎపిలో ఉండడం వల్ల యువతకు ఉద్యోగావకాశాలకు ఏమాత్రం కొరత ఉండదన్నారు. వచ్చే ఐదేళ్లలో ఎపి పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రం జెట్ ప్లస్ స్పీడ్‌తో అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు.



రాంగ్ రూట్‌లో అన్‌లోడ్ చేస్తున్న వాహనదారుడు

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

ట్రాఫిక్‌కు అంతరాయం.. ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాలు ఆపడం, పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. రొద్దంలోని చిన్నఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకూ దుకాణా లకు వెళ్లే వారు వాహనాలను ప్రధాన రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహ నాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ట్రాఫిక్ స్తంభించి రాకపోకలు నిలిచిపోతు న్నాయి. దీనికి తోడు కిరాణా దూకాణాలకు సరుకులు తెచ్చే వాహనాలను సమయం సందర్భంగా లేకుండా ఎక్కడ పడితే అక్కడ దుకాణాల మందు నిలిపి సరుకులు దించుతుంటారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు రాకపోకలు సాగించాలంటే డ్రైవర్లు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కావున పోలీసులు స్పందించి రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా, పార్సిల్ వాహనాలు ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా ట్రాఫిక్ లేని సమయంలో సరుకులు దించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మోటార్లు తొలగించాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట

కొందరు వ్యక్తులు పంచాయతీ కొళాయిలకు మోటార్లు ఏర్పాటు చేసి నీరు తోడుకుంటున్నారని, దీంతో మిగిలిన ప్రాంతాలకు నీరు అందడం లేదని మండలంలోని దోర్నాల గ్రామ ప్రజలు వాపోతున్నారు. వారు మాట్లాడుతూ పంచాయతీ బోరులో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు అరకొర వస్తున్నా యన్నారు. దీనికి తోడు కొందరు వ్యక్తులు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీరంతా తోడేస్తున్నారని, దీంతో మిగిలిన ఇళ్లకు నీరు అందడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు ఏర్పాటు చేయవద్దని కోరితే దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు సర్పంచి, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న మోటార్ కనెక్షన్లు తొలగించి నీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

నేడు కదిరిలో ప్రజా గ్రీవెన్స్

పాల్గొననున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ వారం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నారు. అందులో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పాల్గొననున్నారు. కావున డివిజన్ పరిధిలోని సంబంధిత మండల అధికారులు, ఎస్‌హెచ్‌ఒలు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. కదిరి డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చాన్నారు. అలాగే కలెక్టరేట్‌లోనూ పిజిఆర్ఎస్ కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని, జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా యధావిధిగా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తారన్నారు. meekosam.ap.gov.inలో ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

'ఆ దారిన వెళ్లాలంటే దుర్వాసన భరించాల్సిందే'

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని మహమ్మాదాబాద్ మెయిన్ బజారు నుంచి గ్రామా లకు వెళ్లే మార్గం నిత్యం దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో 'ఆ దారిన వెళ్లాలంటే దుర్వాసన భరించాల్సిందే'నని స్థానికులు, బాటసారులు, వాహనదారులు పేర్కొంటున్నారు. వివరాలు.. మహమ్మాదాబాద్ మెయిన్ బజారు నుంచి ఎస్సీ కాలనీ, గొల్లపల్లి, వడ్డిపల్లికి రహదారి ఉంది. ఈ మార్గంలో నిత్యం ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఆ దారిలో ఓ పురా తన ఉప్పునీళ్ల బావి ఉండగా చుట్టూ గోడ ఏర్పాటు చేశారు. బావి పక్కనే డ్రెయినేజీ కాలువ కూడా ఉంది. ఇదే అదునుగా భావించిన స్థానిక చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను అందులో వేస్తున్నారు. దీంతో నిత్యం తీవ్రమైన దుర్వాసన వెదజ ల్లుతుండడంతో రాకపోకలు సాగించే వారు అక్కడికి రాగానే ముక్కు మూసుకుని వెళ్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇకనైనా అధికా రులు స్పందించి బావి, డ్రెయినేజీ కాలువను శుభ్రం చేసి, ఇకపై చికెన్ వ్యర్థాలను అందులో వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్తున్న పాదచారులు